క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితుడికి ప్రభుత్వ విప్ పరామర్శ



ఇల్లును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితుడు గంగారెడ్డిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. అగ్నిప్రమాదం జరగడానికి కారణలేమిటని అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, కృష్ణచారీ, సత్యనారాయణ, నర్సయ్య పాల్గొన్నారు.

ఆహ్వానపత్రిక అందజేత



ఆహ్వానపత్రిక ఇస్తున్న చైర్మన్ మల్లేశం, సభ్యులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈనెల 24న జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టక్కూరి మల్లేశం, గంగాధర్‌గౌడ్, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే మేనేజర్

జగిత్యాలరూరల్: పట్టణ శివారులోని లింగంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం రాయికల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్టేషన్‌మాస్టర్ ద్వారా రైల్వే సిగ్నల్ వ్యవస్థ, ట్రెన్ నడుస్తున్నప్పుడు స్థానిక స్టేషన్‌తో సమన్వయం ఎలా జరుగుతుంది, ట్రెన్‌లో ఉండే వివిధ బోగీల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెట్‌పల్లిరూరల్: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెట్‌పల్లి పట్టణంలో ఏబీవీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెట్‌పల్లి నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం పాత బస్టాండ్ వద్ద నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అరవింద్, అభి వెంకట్, ఈశ్వర్, జావేద్, జయంత్, విష్ణు, అక్షయ్, సాయిరాం,మహేందర్ పాల్గొన్నారు.

జీపీఎఫ్ టీచర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాలి



జెడ్పీసీఈవోకు వినతిపత్రం అందిస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు

జగిత్యాల: జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జెడ్పీ జీపీఎఫ్ నగదును వారి డీడీవో అకౌంట్ ఖాతాలో కాకుండా వారి వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, బోయనిపల్లి ఆనందరావు అన్నారు. బుధవారం జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రాయికల్ మార్కెట్ చైర్మన్ జనరల్ కే..?

- ఆశావహుల మధ్య తీవ్ర పోటీ
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆశీస్సులు ఎవరికో..?

రాయికల్: రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గిరి కోసం కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత పదేళ్లుగా ప్రతిపక్ష పాత్రలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టులపై మండల నాయకుల దృష్టి పడింది. దీని కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చుట్టూ ఆశావహులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

జనరల్‌కు దక్కే అవకాశం

రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్–3లో ఉండగా, గతంలో బీసీ మహిళకు కేటాయించగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎలగందుల ఉదయశ్రీ, తర్వాత జనరల్‌కు కేటాయించడంతో మైతాపూర్ గ్రామానికి చెందిన గన్నె రాజిరెడ్డి, ఎస్సీ మహిళకు కేటాయించడంతో రాయికల్ పట్టణానికి చెందిన మారంపల్లి రాణి చైర్మన్ పదవులు దక్కించుకున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జనరల్‌కు కేటాయించే అవకాశం ఉండటంతో చైర్మన్ గిరి కోసం పోటీ తీవ్రంగా ఉంది. పట్టణానికి చెందిన కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఎద్దండి దివాకర్, ఆలూరుకు చెందిన రవీందర్‌రావు, ఇటిక్యాలకు చెందిన కాటిపల్లి గంగారెడ్డి, కొత్తపేటకు చెందిన చింతలపల్లి గంగారెడ్డి, బోర్నపల్లికి చెందిన కొడిపల్లి ఆంజనేయులు చైర్మన్ రేసులో ఉన్నట్లు ప్రముఖంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి గత పదేళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికో ఒకరికి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. అంతేకాకుండా గతంలో రెండేళ్ల పదవీకాలం ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకమండలి పదవీకాలం ప్రస్తుతం మూడేళ్లకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పాలకమండలి సభ్యులు 18 మంది

మార్కెట్ కమిటీలో మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, అగ్రికల్చర్ ఏడీ, మార్కెటింగ్ డీఎంతో పాటు, 14 మందిని డైరెక్టర్లుగా నియమిస్తారు. ఇందులో ఒకరిని చైర్మన్‌గా, వైస్ చైర్మన్ గా నియమించే అవకాశం ఉంటుంది. మరో 2–3 రోజుల్లో రాయికల్ చైర్మన్ రిజర్వేషన్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో ఆశావహులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలుస్తా

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: పేదింటి ఆడబిడ్డలకు కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకిచ్చిన 420 హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, దేవ మల్లయ్య, కొమ్ముల జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజయ్

క్రీడా మైదానం చదును కోసం నిధులు మంజూరు చేయాలి

మల్లాపూర్: క్రీడా మైదానం చదును చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మండలంలోని రేగుంట ఆల్‌యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేశ్, సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగుంట శివారులోని స్థలంలో యూత్ సభ్యులు, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు అనువుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏలేటి శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేములవాడ దేవరాజం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎండీ.ముస్తాఫా, సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద బ్రాహ్మణులచే అలివేలు మంగ సహిత పద్మావతి వేంకటేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి కళ్యాణం తిలకించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24న డోలోత్సవం, 25న రథోత్సవం, 26న ఎడ్లబండ్ల పోటీలు జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాకాల నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాటేటి సతీష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

మల్యాల: మండలంలోని మానాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య మంటపానికి తీసుకువచ్చి, ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు.వందలాదిమంది భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి బోనాలు

రాయికల్: పట్టణంలోని గంగమ్మతల్లికి బుధవారం గంగపుత్ర సొసైటీ ఆధ్వర్యంలో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువు వద్దనున్న గంగమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తోపారపు రవీందర్, యువజన అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, కౌన్సిలర్ కల్లెడ సునీత, మహిళ సొసైటీ అధ్యక్షురాలు కల్లెడ లత, సభ్యులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జాతర

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో వీరబ్రహ్మేంద్రస్వామి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞం నిర్వహించారు. జాతరకు వచ్చిన భక్తులకు స్థానికులకు శ్రీగద్దె అన్నపూర్ణ–నరహరి దంపతులు అన్నదానం చేశారు. అన్నదాతను విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఆర్డీవో

జగిత్యాల/రాయికల్: డీఆర్డీవో ఇటీవల నూతనంగా నియమితులైన సంపత్‌రావు, రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వర్ గౌడ్ బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం గ్రామీణాభివృద్ధి,పట్టణ అభివృద్ధిపై చర్చించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్లాపూర్: మండలంలోని సాతారం శివారులోని పెద్దవాగు నుంచి బుధవారం అక్రమంగా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం సాతారం శివారులోని పెద్దవాగు నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ నుంచి మెట్‌పల్లి కి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహన యాజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో మోడల్‌స్కూల్ విద్యార్థి ప్రతిభ

జగిత్యాలరూరల్: రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌ఈఆర్‌టీ జిల్లా విద్యాశాఖ, టీటీఎస్‌ఎఫ్, ఎఫ్‌పీఎస్‌టీ ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లాస్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థిని ఆర్.అశ్రిత వర్మ తృతీయస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగసుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి డీఈవో జగన్మోహన్‌రెడ్డి ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

వ్యాసరచన పోటీల్లో..

మెట్‌పల్లిరూరల్: సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. పోటీల్లో విద్యార్థులు మణిచంద్, ప్రతిభ, రిచా సాయిబాబా, రాజేశ్ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎస్సై కౌన్సెలింగ్

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థిపై తోటివిద్యార్థులు దాడి చేసిన ఘటనపై ఎస్సై ఉమాసాగర్ బుధవారం పాఠశాల విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులు అనవసరమైన గొడవల్లో తలదూర్చి వారి ఉజ్వలమైన భవిష్యత్తును పాడుచేసుకొవద్దని,అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జక్కని రాజేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోపా సామాజిక సేవలు అభినందనీయం

జగిత్యాల: పద్మశాలీలు ఉద్యోగస్తులుగా, వ్యాపారస్తులుగా అనేక రంగాల్లో ఉన్నతస్థానంలో ఉంటున్నారని, పోపా చేసే సామాజిక కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక భక్త మార్కండేయ దేవాలయంలో పద్మశాలి అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వారి ప్రమాణస్వీకారంలో పాల్గొని మాట్లాడారు. పద్మశాలీ సంఘానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాజేశ్, జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి రఘువరణ్, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

మల్లాపూర్: గ్రామాల్లో అభివృద్ధి నిధులతో అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు తెలిపారు. మండలంలోని సిరిపూర్, పాతదాంరాజుపల్లి, కొత్త దాంరాజుపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో పీసీసీ ఫీషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమ్ముల చిన్నారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం, ఎర్దండి లో ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్ల నిర్మాణాలకు బుధవారం టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు తిమ్మణి రాములు, బాశెట్టి రాధ, వీడీసీ అధ్యక్షుడు కల్లెడ రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై సమీక్ష సమావేశం

కథలాపూర్: వచ్చే నెల 3న పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు బుధవారం సమావేశమయ్యారు. మండలంలోని కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామాల్లో 0–5 వయస్సు గల చిన్నారులు 2,200 మంది ఉండగా.. 13 కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, వైద్యాధికారులు సింధూజ, రచన, ఆర్‌ఐ నాగేశ్, సూపర్‌వైజర్ భూషణ్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మెట్‌పల్లిరూరల్: కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యమని, రాష్ట్ర మంత్రులను కలిసి నియోజకవర్గానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నేతలు బుదవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కారుకురు నర్సయ్య, తిరుమల గంగాధర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గొల్లపల్లి: మండలంలోని శంకర్‌రావుపేటలో విద్యుత్‌ఘాతంతో గేదె మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన గోలి బక్కన్న కు చెందిన రూ.90 వేల విలువ గల గేదె మృత్యువాత పడటంతో నష్టపరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. గ్రామం మధ్యలో ఇళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని విద్యుత్ అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో అటుగా వెళ్లిన గేదె మృత్యువాత పడింది. ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హనీట్రాప్‌లో విద్యార్థి సంఘం నాయకుడు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఓ పార్టీ విద్యార్థి సంఘం నాయకుడు హనీట్రాప్‌లో చిక్కుకున్నాడు. దీంతో ఆ వీడియో వైరల్ కావడంతో జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. విద్యార్థి సంఘం నాయకుడికి ఓ యువతి ఫోన్ చేసి అశ్లీలంగా చూపిస్తూ తాను కూడా నగ్నంగా ఉండాలని సూచించడంతో విద్యార్థి సంఘం నాయకుడు నగ్నంగా ఉన్నాడు. దీంతో యువతి వీడియోను రికార్డు చేసి డబ్బులకు డిమాండ్ చేసింది. దీంతో డబ్బులివ్వకపోవడంతో ఆ యువతి వీడియోను వైరల్ చేసింది. దీంతో వీడియో వైరల్ కావడంతో విద్యార్థి సంఘం నాయకుడు జంకుతున్నాడు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నాన్ అఫీషియల్ ఐదుగురు, ఎస్సీ, ఎస్టీలకు చెందిన ముగ్గురు, నాన్ అఫిషియల్ సభ్యులు స్వచ్ఛంద సేవ సంస్థలతో సంబంధం కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీలు కాకుండా ఇతరుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈనెల 29 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు బయోడేటాతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు చేసిన సేవలతో కూడిన ఆధారాలు, పేపర్‌క్లిప్‌లు, ఫొటోలు, స్వచ్ఛంద సేవ సంస్థలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తులను జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

అఖిల భారత విద్యార్థుల సదస్సు విజయవంతం చేయాలి

జగిత్యాలటౌన్: భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేలా ఉన్న నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన నూతన జాతీయ విద్యావిధానానికి నిరసనగా హైదరాబాద్‌లో ఈనెల 25,26 తేదీల్లో జరిగే అఖిల భారత విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న సదస్సుకు బుద్ధి జీవులు,మేధావులు, అధ్యాపకులు,విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా కో – ఆర్డినేటర్ పిట్టల నారాయణ, మహ్మద్ షేక్, బోనగిరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు కసితో చదివితే ఏదైనా సాధించవచ్చని మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని కోరారు. నేను మా అమ్మ చెప్పిన మాట వల్లనే ఈ రోజు డీఎస్పీ స్థాయికి ఎదిగానని తన అనుభవాన్ని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు ప్రేమ పెళ్లిళ్లకు దూరంగా ఉండాలని, గంజాయి మత్తు పదార్థాలకు దూర ఉండాలని సూచించారు.అనంతరం డీఎస్పీ, సీఐ, ఎస్సైలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇంటర్‌మీడియట్ జిల్లా విద్యాధికారి నారాయణ, డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై అనిల్, ప్రిన్సిపాల్ సంజీవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులు వ్యసనాలతో చెడుదారి పట్టొద్దు

మల్లాపూర్: యువత, విద్యార్థులు చిన్నవయసులోనే వ్యసనాలకు బానిసగా మారి చెడుదారి పట్టొద్దని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫేర్‌వెల్ డేలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేడు యువత సామాజిక మాధ్యమాల వలయంలో చిక్కి చెడుమార్గాల వైపు దారి మళ్లుతున్నారన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాలు మానుకుని ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కాలిక్, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

మహాశివరాత్రి జాతరకు టెండర్లు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శ్రీ పౌలస్తేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర కోసం టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు ఈవో వేణుగోపాల్ తెలిపారు. ఆలయంలో మార్చి 7 నుంచి 9 వరకు జరిగే మహాశివరాత్రి జాతర ఉత్సవాల్లో లడ్డు, పులిహోర, కొబ్బరికాయల విక్రయం హక్కు కోసం టెండర్లు ఈనెల 20న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తి గల వారు టెండర్‌లో పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

పెగడపల్లి:మండలంలోని లింగాపూర్‌లో శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం నిత్య హోమం, బలిహరణ, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పాల్గొని పూజలు చేశారు.

24 నుంచి భీమన్న జాతర మహోత్సవాలు

రాయికల్: పట్టణంలో ఈనెల 24 నుంచి 26 వరకు భీమన్న జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు దేవుని రాజం, భీమన్న యూత్ సభ్యులు బుధవారం తెలిపారు. 24న స్వామివారి కల్యాణం, 25న స్వామివారి దర్శనం, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, 26న రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

గొల్లపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్, గంజాయి నిర్మూలన, డయల్ 100 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా సాగర్

కోరుట్ల: బీజేపీ పట్టణ కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్ బుధవారం నియమించారు. ప్రధాన కార్యదర్శిగా చెట్లపెల్లి సాగర్, ఉపాధ్యక్షులుగా ఎర్ర రాజేందర్, కంటం ఉదయ్, ముల్క ఆంజనేయులు, ఆది మల్లేశ్, ఉరుమడ్ల నరేశ్, ఓల్ప్రెజి నగేశ్, కోశాధికారిగా గుద్దేటి రాజేందర్‌ను నియమించారు. కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

సమాచార హక్కు చట్టం జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేశ్

జగిత్యాలజోన్: జిల్లా సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా పెగడపల్లి మండలం బతికెపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది రాగం రమేశ్‌ను నియమిస్తూ జిల్లా కార్యవర్గం ఆదేశాలు జారీ చేసింది. సామాజిక న్యాయం కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తానని రమేశ్ ప్రకటించారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ మండల కార్యవర్గం ఏర్పాటు

జగిత్యాలరూరల్: మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుదారపు జ్ఞానేశ్వర్, సెక్రటరీగా కోల మహేందర్, కోశాధికారిగా మేనిని శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గంగాధర్, శంకరయ్య, భూమరాజం, గణేశ్, మోహన్, శంకర్, అబ్దుల్లా,రాకేశ్ పాల్గొన్నారు.